# చిన్న కొడుకు

"భమిడిపాటి"

[ చిన్న మేనల్లుడు చిరంజీవి సుబ్బారావుకి ప్రేమాశీర్వాదములతో అంకితం. ]

'ఇదిగోటోయ్! బావా! ఇంకో మేనల్లుడు! ఇద్దరు కూతుర్లని కని పెళ్లి చేయాల్సిన పని నీమిదవుంది!' అంటూ అందిచ్చాడు రవణబావ తన చిన్నకొడుకుని.

'అన్నయ్యా! వాడికి సుబ్బారావు అనిపేరుపెట్టాం! మీబావ మాత్రం 'రాజు' అని పిలుస్తారు. అసలుమాటెలాగున్నా ఆడంబరాలు పోవుగా పంతులుగారికి!' నవ్వుతూ ఎదురయింది చెల్లమ్మ చిట్టి.

మొన్నమొన్న బొమ్మలపెళ్లికని నాతో పంతంపట్టే చెల్లెమ్మే నా యిప్పుడు తన చిన్నకొడుకు పెళ్ళిమాట లంటుంది!

'చిట్టీ! చాలా బాగుందమ్మ పేరు! సుబ్బారావు అనేపేరుతో ప్రసిద్ధ పురుషులున్నారు ప్రపంచంలో! నీ కొడుకు కూడ ఏ ప్రాపసరో అవుతాడులే!'

'అదెంతపనోయ్ బావా! నీవంటిమావఁలుంటుంటే అవడానికి అభ్యంతర మేమిటి! ఏదైనా అవుతాడు!' నాజోస్యాన్ని నవ్వుతూ బలపరచాడు రవణబావ.

'రానివాడివి చాలారోజులకి వచ్చావు ఒక నెల్లాళ్లపాటయినా వుండిపోరాదూ అన్నయ్యా!'

'అదెలాగవుతుందమ్మ! ఈ వారంరోజులు సెలవకే నానా అవస్థ పడాల్సొచ్చింది, ఇదిగో! ఈ 'యువరాజుగార్ని' 'సందర్శిద్దామని' వచ్చేయాల్సొచ్చింది!'

దీవనతో పిల్లాడి నుదుటిమీద ముద్దులు కురిపించాను. ఆ లేత మాతృహృదయం ఆనందంతో వికసించింది.

'అన్నయ్యా! వీడు చాల దురదృష్టవంతుడు. లేకపోతే అంత హాయిగావుండే సంసారం ఎలా మారిపోయిందో చూశావా? పెద్దవాడికి జరిగిన 'ముద్దు' లో వీడికొక పదోవంతయినా వుందీ? ఆఖరుకి కాళ్ల గజ్జె కూడలేకుండా మొలకొకముప్వయినా లేకుండా ఎలాగున్నాడో చూశావా?

'పిచ్చిదానిలాగున్నావు పిల్లా! ఎప్పుడూ ఒక్కలాగేవుండమంటే వుంటుందా? అందరికి ఒక్కలాంటి వైభవము రమ్మంటేవస్తుందా? నిజానికి యిలాటివారే ముమ్ముందు గొప్ప అదృష్టవంతులు, సుఖజీవులు అవుతారు తెలుసా? దీనికేం విచారించనక్కర్లేదు చిట్టీ!'

'అసలే లేదనిబాధ, అందులో ఆయనేమిటో ఈమధ్య పజిల్సపిచ్చిలో పడి కానీ అడుగుతే లేదంటారు. ఆ సమయానికి రెండూ మూడు అప్పయినా చేసి కట్టిస్తుంటారు.'

దీనికితోడు రాత్రి పన్నెండు, ఒంటి గంట వరకూ ఏదోచదవడం, వ్రాయడం.

ఆ తల్రకింద చూడు ఎన్ని పుస్తకాలున్నాయో! మనిషిని చూచేవుగదా ఏం సుందరంగా వున్నారో!...భోజనం, నిద్ర సమయానికి లేకపోతే ఎలాగుంటారు మరి? నువ్వేనా చెపుదూ అవి వదిలేయమని. యిలాచూస్తే పిచ్చివెత్తేలా అగుబడుతున్నారు'

'ఇదంతా కొన్నాళ్ళేలే! చేతిలోది కాస్త తగ్గగానే ఈ ఆశలన్నీ పుట్టుంటాయి. యిదీ అయి పోగానే ఆ సరదా తీరిపోతుంది!

అదిగాక యింటిసంగతి ముందుచూచుకోక, ఆ దుబారా ఎందుకో'

'ఇదిన్నూ వీడుపుట్టాక పుట్టినబుద్ధే! అంతకుముందు లేనేలేదు. పిల్లడికి దగ్గుగావుంది మందు తెమ్మంటే, 'నేనేం మందులూ తేలేను. అదేతగ్గుతుంది రెండురోజుల్లో!' అంటారు.

'నే నెక్కడా ఏంతేగలను? ఇదంతా వీడి కర్మంరా!'

'కంటనీరుపెట్టకు చిట్టీ! అనవసరంగ సంసారభారం నెత్తిని వేసుకుంటున్నావు. కష్టకాలాల్లో ధైర్యంగా వుండగలిగేదే జీవితమమ్మా! పాపం చిన్నదానివి నీకు ఈ తాపత్రయం పట్టుకుంది! అవునుగాని, ఈకడుపు మీదేంటీ పిల్లాడికి గట్టివుండలా తగుల్తూంది?'

'ఎదో వేడికి పుట్టిన గడ్డలే! చందనంతీసి పెడ్తాను తగ్గుతుంది. లే! లే! భోజనంచేద్దువుగానీ ఆయనకోసం ఎదురు చూస్తే తెల్లవారదూ?'

♦ ♦ ♦ ♦

'ఇదేమిటో అర్థంకాలేదండీ, మామూలుగా ఏదో శగగడ్డ అనుకున్నా కాని ఏమీ తగ్గడంలేదు. సరిగదా పెద్దదవుతుంది. అంతేగాక, మరోరెండు చోట్లకూడ అగుబడ్తూంది. ఎలాగయినా కాస్తమాసి డాక్టరుకి చెప్పి పెడుదురు?'

బయట అరుగుమీద పళ్లుతోముకుంటూన్న రవణమాష్టర్‌తో మెల్లగా చెప్తూంది చెల్లమ్మ.

అప్పుడే లేచివచ్చాను. ఈమాటలు వినగానే భయమేసింది. ఏమొచ్చినా ఎన్నాళ్లు వుండి పోమ్మంటుందో!

'ఏదీచూడని! నాకేమీ అర్థంగాలేదు! ఎవరో చిన్నపిల్లల సంగతి తెలసిన ముసలమ్మలని కనుక్కో. తరువాత ఎదోవిధానం ఆలోచిద్దాం...చూడవోయ్‌బావా! తగుల్తే వరుసమీద డాక్టర్లకే! చూస్తూండగా యిచ్చానా మొన్న ముప్ఫైరూపాయలు డాక్టరుకి. గతనెల నాకు జ్వరం. మీ చెల్లమ్మకి ఎప్పుడూజ్వరమే! ఆదేం శరీరాలోగాని! వాడూ మొదటివాడు మొన్నటికి నయం కొంత దగ్గు తగ్గి. యిక ఈ చిన్నవాడు పుట్టినదగ్గర్నుండీ జబ్బులే! యిప్పుడేదో మళ్ళీ తెచ్చాడు; చూద్దూ!'

'డాక్టర్ను రమ్మనండీ బావ! ఈ ఖర్చు నేనిస్తాను. లేకపోతే పిల్లాడ్ని వదిలేస్తామా?'

'అంత చికాకు చేస్తుందంటావోయ్!'

కాఫీకని లోపలికి వెళ్లిపోయాడు.

♦ ♦ ♦ ♦

'ఎదురింటావిడ చెప్పడం ఎద్దో పిల్లలకి మామూలుగ వచ్చేజబ్బని, రెండు రోజులు ఓపికపడ్తే తగ్గి పోతుందనీ. ఏమిటో అన్నయ్యా నాకు మా భయంగా వుంది. నువ్వీమూడురోజులూ వుండి, పోరాదూ!' అంటూ కంట తడిపెట్టింది చిట్టి.

‘ఇప్పుడొచ్చిన భయ మేమీ లేదమ్మా! మూడు మాసాలయినా వుంటాను. నీసౌఖ్యంకన్న నాకు కావలసిందేమిటి చెప్పు?’

అని సమాధానపరచాను భగ్నస్వరంతో. చెల్లమ్మ బాధకి హృదయంలో అర్థంకాని ఆవేదన కలుగుతూంది.

మూడురోజుల్లో ఒంటిమీద పదిగడ్డలవరకు అగుపడ్డాయి. వెనుకటివాటి నివారణ లేదుగానీ దిన దినమూ వాటి సంఖ్య అధికమవుతూంది.

చూస్తుంటే నాకేమీ అర్థంకాలేదు. భయమూ వేశింది.

ఏంచేసేందుకు తోచడంలేదు. పిల్లాడు ఒంటిమీద చెయ్యివేస్తే ‘కెవ్వు’మని ఒకటేఏడుపు! పక్కలకు ఒత్తిగిలలేడు.

ఎల్లప్పుడూ తల్లిరొమ్ముమీదనే మూల్గుతూ, బాధనిభరించే కళ్లు మూసుకునివుండడం.

ఒక్క నిముషం తల్లిని విడిచేందుకులేదు. స్నానంలేదు, పానంలేదు, భోజనంలేదు, కదలవీల్లేదు.

మంచాన్నే అంటివుండేది చిట్టెమ్మ. ఒకావిడె చెప్పింది. ‘పిల్లల జబ్బులు లీలగా బాగుచేసే వైద్యుడు దగ్గరగ్రామంలో వున్నాడు, వెళ్లిచూపితే మంచిది’ అని. ఆరాత్రి తెల్లవార్లూ నిమిషమేనా నిద్దర లేదు, ఒకటే ఏడుపు!

అర్థంకాని ఆ చిన్నవాడిబాధకు అనవసరభయం పడిపోతూంది ఆ కన్నతల్లి.

ఇంటిపనులూ, బడిపిల్లాడి జాగ్రత్త చూసుకునేసరికి తల దిమ్మెక్కిపోతూంది రవణబావకి.

ఎలా వదిలివెళ్లేదీ! మళ్లా సెలవు కోరుతూ వుత్తరంవ్రాశాను.

మర్నాడు తెల్లవారుతూనే బండి కట్టించుకున్నాం. బయలుదేరాం.

బండి కుదుపుకి దారంతటా హాయిగానుండి పిల్లాడు ఊరుకున్నాడు.

చూచాడువైద్యుడు. ఆలోచించి, ‘సాయంత్రం ఎవరినయినా పంపండి. ఓ చెక్కయిస్తాను. గంధంతీసి పూతురుగానీ’ అన్నాడు.

ఆ యిచ్చేదేదో, మమ్మల్ని చంపక అప్పుడేయిస్తే- ఊహూ! తన వైద్యం కట్టుబాట్లు అతిక్రమించకూడదట!

సాయంకాలం ఆ రాళ్లుతేరిన రోడ్డంత, ఆరుమైళ్లు పరుగున వెళ్లితెచ్చాను. గంధంతీసి పూశాం.

రాత్రి షుమారు పన్నెండు కావచ్చింది. అంతవరకు ఏడ్చి మరి ఏడ్వలేక ఊరుకున్నాడు పిల్లాడు.

అర్థంకాని ఆ కళ్లలో తన హృదయమంతా పెట్టేసుకుని చూస్తూంది ఆ మాతృదేవి చిట్టెమ్మ.

రవణబావ పెద్దపిల్లాడితో గూడ అప్పుడే గదిలోకివెళ్లి పక్కమీద చేరబడ్డాడు.

‘అన్నయ్యా! నువ్వూ వెళ్లి కాస్సేపు నిద్రపోరాదూ! ఊరుకున్నాడులే! నేను చూస్తుంటాను, ఏమన్నా అవసరముంటే ఆయన్ని పిలుస్తాలే’ అన్నది చిట్టి, నాయందు తన బాధాహృదయంలో సానుభూతి వుందన్నట్టు.

నేను మెల్లెక్కుతూ, ‘భయంపడకమ్మా! ఈ పిల్లలతోనూ కాని అవస్థ తల్లులికి!’ అని ఓదార్చాను.

పక్కమీద పడుకున్నానేగానీ నిద్దరరాదు.

'...తల్లి! ఎంతటి బాధలుపడుతూంది తనయుని క్షేమానికి? వాడికిబాధగాదు ఈమెకీ! నిద్రాహారాలులేక పథ్యాలతో, భయపూరిత హృదయంతో బాధపడే ఆ చిన్నకొడుకుని చూచి ఎంత పరితపిస్తోంది ఆ కన్నతల్లిహృదయం!

మాతృత్వము ఎంత కఠినము! యింత కష్టపడి కనిపెంచిన తల్లిని తెలియక ఎంత అనాదరణ చూపుతారు, అవమాన పరుస్తారు పెద్దవారయాక ఈ తనయులు!

తనయులు వీరేనా!!

ఎన్నిచేసినా, ఈ జీవితమంతా ఆమె సేవకే వినియోగించినా తల్లిఋణం తీర్చలేం.

ప్రపంచంలో నూటికి తొంభైతొమ్మిదిమంది తల్లికి ఋణపడినవారే!...'

అని అగాధమైన చీకటిలోకి చూస్తూ, ఆలోచిస్తున్నా.

'అయ్యో, అన్నయ్యా!...'

త్రుళ్లిపడిలేచాను. గబుక్కున మెట్టుమీద కాలువెయ్యడంలో 'ధడేలు'మని చప్పుడుతో కాలు జారి పోయింది. హృదయంతోపాటు ప్రక్కగోడకు బుర్ర తగిలింది గావున నిల్చానుగానీ లేకపోతే ఏమయేవాడ్నో?...

తొందరగా వెళ్లాను.

'చూడు అన్నయ్యా! కదిలిక ఏమీలేదు. కదిలించినా ఏడుపులేదు. ఆ చూపులు ఎలాగున్నాయో!...నాకు భయమేస్తూంది.'

'భయంలేదమ్మా! చిన్నవాడా మరి! ఆ బాధకి తాళలేక, అలసిపోయాడు అందుకే...పాలివ్వు! నేనుంటాను యిక్కడ. అనవసరంగా భయపడతావమ్మా!'

ఓదార్చేందుకు అలాగన్నానే గానీ సాంతా సంశయం ఓ ప్రక్క పీడిస్తూనేవుంది.

ఆ వాడిన తల్లివదనం చూస్తే ఆ చూపులకు నా హృదయం నీరయి కనులవెంబడి రాసాగింది.

చూస్తే చెల్లమ్మ భయపడ్తుందని బుర్రవంచుకుని పచారుచేయసాగాను.

'డాక్టరు యివేళ రమ్మన్నారు. ఆస్పత్రికి తీసుకవెళ్తే పరీక్షచేస్తారు. నేనూ వస్తాను. నువ్వూ చెల్లమ్మా పిల్లాడ్ని తీసుకెళ్లండి. ఆలస్యమయినా బాధలేదు. నేను ప్రయివేటుకి శెలవుచెప్పి వస్తాను.'

అని పొద్దున కాఫీలు త్రాగేటప్పుడు చెప్పేసి వెళ్లిపోయాడు రవణబావ.

హాస్పిటల్‌కి చేరేసరికి 9 గంటలయింది.

'రోగుల్నీ, మందుల్నీ చూచుకుని డాక్టరుగారు వచ్చేవరకు మరో అరగంట కావచ్చు.'

'అయితే నేను బడికి వెళ్తాను. నువ్వుంటావుగా దగ్గరా! చూడు డాక్టరేమంటారో!'

వెళ్లిపోయాడు.

మరో ముప్పావు గంటకల్లా డాక్టరుగారొచ్చి పరీక్షచేశారు.

'సామాన్యంగా బాగయేలా తోచదు. Open చేయడమే కర్తవ్యంలా అగుబడ్తూంది.'

చెల్లెమ్మ భయపడ సాగింది.

'కోస్తే బతుకుతాడా? ఆర్నెల్ల పిల్లవాడికి ఒంట్లో ఏముంటుంది డాక్టరుగారూ!'

'ఏమీలేకపోతే బాధలేదుగానీ, యివుంటే మంచిదా? ఒక్కొక్కటీ ఎంతకని మాన్పచూస్తాం?'

'ఒళ్లలా రాళ్లలా ఆగడ్డలు పుట్టుకరావడం బాగుందిగానీ కోతలే బాగులేదా! కానివ్వండి...'

'కొత్త కత్తులకి పిల్లాడిరక్తం బోణీ!' నర్సులతో పరియాచకంగా అంటూ వెళ్లిపోయాడు డాక్టరు.

'ఏదో మీరే నిర్ణయించండీ, నేనేలా.'

'వద్దన్నయ్యా! నాకేమో భయంగావుంది. మరేంచేస్తారో! నేనిక్కడమాత్రం వుండలేను.'

తొందరపెట్తూన్న ఆ పరితప్త మాతృహృదయంకి ఎలాటి సమాధానం చెప్పలేకపోయాను.

యింటికి వచ్చేశాం.

'ఏం? ఆపరేషను చేస్తే ఏం కొంపమునిగిపోయింది? యిలా వాడు, వాడితోపాటు మనమూ బాధపడడము బాగుందంటావా? అసలుకే లేదనిబాధ అందులో యిదిగూడ. ఏన్నాళ్లూ?...కానీ మనవాడయితే బ్రతికివస్తాడు, లేదా...ఎవరు కర్తలుండానికి? నేను మొదటే చెప్పలేదు? ఎవడి ఖర్మంకి వాడేబ్రతుకుతాడని. మరేం ఆలోచించక డాక్టరు చేతిలోపెట్టి నమస్కారంచేయి! అదృష్టముంటే బ్రతికివచ్చాడా మనవాడే. లేదా...''

ఆలోచనకు కూడ అవకాశం లేకుండా అదే రవణబావ మాటలకు మారాడకుండా ఒప్పుకుంది చిట్టెమ్మ.

'నువ్వుకూడ పద బావా! యివేళ ఆపనిచేయిద్దాం. యింకేమయినా మందులుచెప్తే తెద్దువుగానీ!'

♦ ♦ ♦ ♦

'ఈవేళ రెండు openచేసాను. రోజువిడచి రోజు చేయాల్సొంటుంది ఆపరేషను.'

పిల్లాడి రక్తబలంకి "Vogan" కొని పాలలో చుక్కలు వేసి యివ్వండి.'' అంటూ 'సల సల' మరుగుతున్న నీటిలో 'తళతళ' మెరసే కత్తి తీసి రెండుగంట్లు పెట్టేసి పోయాడు డాక్టరు. అబ్బా!... ఎంతఘోరం! మామూలు హృదయాలు ఆగలేవు ఆ దృశ్యానికి. రక్తంపేరు చెప్తేనే సొమ్మసిల్లేవారు ఆ రక్తపాత్రను చూచి మరి బ్రతికేదేంటి?

రవణ బావ నే చూడలేనని బయటకు వెళ్లిపోయాడు. మధ్యలో పిల్లాడు హఠాయించి పోతాడు దాహంకని చెల్లెమ్మను లోపలే వుండమన్నారు.

ఆ రక్తం...తన చిన్నకొడుకురక్తం ...కనుల చూచిన చిట్టి, ఎంత భయపడిందో...

పరితప్త హృదయం. ఆహారం నిద్రా ఎరుగదు...అందులో...

మిగిలిన పనులు పూర్తిచేసి పిల్లాడ్ని చేతులోపెట్టారు. తెరచి తెరవక కళ్లతో ఆయాసపు దృష్టులు కనబర్చుతున్న ఆ బాధిత బాలుని ముఖంచూచి విహ్వాల అయిపోయింది చిట్టి.

నడుస్తూంటే పదం తొట్రుపడటం గమనించి నేను 'చిట్టీ'అని పిలిచా గట్టిగా.

"ఆఁ!...ఆఁ!...అంటూంది పిచ్చిగా ఎటో చూస్తూ. చేతిలో పిల్లాడున్న సంగతే మరచి. ప్రమాదం గ్రహించి గబుక్కున చేతిలో పిల్లాడ్ని పుచ్చేసుకుని 'బావ'కి కేకవేశాను.

మూర్ఛపోయే అవస్థలోవున్న చెల్లెమ్మను పట్టుకుని, అరుగుమీద కూర్చుండబెట్టి రెండుసోడాల సపర్య చేశేవరకు తెలివి తెచ్చుకుంది.

మెల్లగా బండెక్కి యిల్లు చేరుకున్నాం, నాడు జరిగిన సంగతంతా చెప్పుకుంటూ.

♦ ♦ ♦ ♦

'క్రిందపడితే పిల్లాడేమవును? యింత దుర్బలమయితే ఎలాగమ్మా! కష్టాలూ అనుభవించ వలసినవే గదా! రేపట్నుంచి నువ్వురాకు! నువ్వు చేయవల్సినపని ఒక్కటే! అది డాక్టరుకి పిల్లాడ్ని అప్పగించేసి ఆ పావుగంటానూ దేవుడ్ని ప్రార్థించడం. 'సజీవుడిగా నా కొడుకుని తిరిగి యిమ్మని'అని ధైర్యం చెప్పాను.

ఆఖరు రోజున కట్టువిప్పేస్తూ అన్నాడు "అదృష్టవంతులండీ. నిజం, ఆ తల్లిగర్భం ఫలించింది. లేకుంటే' Hopeless Case '! అనుకున్నా మొదట"

ఆర్నెల్ల అబ్బాయి. వయస్సుకి మూడురెట్లుకోతలు. శరీరంలో మూడొంతులు తరిగేపోయింది.

ఇంతకీ ఘోరం అనుభవించాడు. యికేబాధ వీడి జీవితంలో వుండదు! పిల్లాడిబలంకి కాస్త జాగ్రత్తపుచ్చుకోండి."

ఆనందంలో లోతుతెలిసిన చిట్టి ఆవేళ బండివాడిఅద్దెసొమ్ము సీధాగా యిచ్చేస్తూ అంది 'తాతా! మావాడు బ్రతికేడోయ్!'

'వెయ్యేళ్లుబ్రతుకుతాడమ్మా వెఱ్ఱితల్లి!' అని దీవెనతో వాడామెను సంతోషపఱచాడు. మొన్నటికి సంవత్సరం నిండింది.

పుట్టినదినంనాటికి నన్ను రమ్మని చెల్లెమ్మ కోరిందంటూ బావ ఉత్తరంవ్రాశాడు.

చూచాను. సంవత్సరం బాలుడయినా ఆర్నెల్లు ఎదుగులేనివాడిలాగుంటాడు.

'మరేభయంలేదు చిట్టీ! యిక అదృష్టవంతుడే! ఆకళ్లుచూడు. వాటిలోనేగదూ తన జీవితం దాచు కున్నాడు? జీవితంలో ఘనత సూచిస్తున్నై'

'ఏమో అన్నయ్యా! నిముషమేనా నన్నువదలి వుండడు. హమేషా ఏడుపే! ఓ ఆటాలేదు పాటలేదు. ఆనందంలేదు.'

మళ్లీ చెప్తున్నా చిట్టీ! యిలాటివాళే మున్ముందు ప్రయోజకులవుతారమ్మ!

తల్లిని మరచిపోలేరు! తల్లిని మరువనన్నాళ్లూ మానవుడి అభ్యుదయానికి లోటులేదు.

ఏనాడయితే ఈదేశంలో మాతృశక్తి నెరుగక తనయులు ప్రవర్తిస్తారో, ఆనాడే ప్రళయం వచ్చిందని నమ్మ!

వీడు అక్రమంగా ప్రవర్తించినా వీడికథ ఎరింగిన లోకం చూస్తూ ఊరుకుంటుందా? ఆమాత్రం గుర్తించలేదూ!

కన్నతల్లి హృదయం అదే. ఈనాడు నేను భగవంతుడ్ని ప్రార్థిస్తున్నా 'ఈచిన్నకొడుకుని కన్న తల్లిహృదయం తెలిసి ప్రవర్తించేలా చేయ'మని!!

---